# సాక్షి కామారెడ్డి

సోమవారం । 9 । సెప్టెంబర్ । 2024




## పాఠశాలను తరలించాలి

బీబీపేటలోని గురుకుల పాఠశాలను మౌలిక వసతులున్న భవనంలోకి మార్చాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు ఆందోళనకు దిగారు.

- 8లో ▸



## 'అమృత్' జలం

బాన్సువాడ బల్దియాలో తాగునీటి సమస్య పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం అమృత్ స్కీం కింద రూ. 52 కోట్లు మంజూరు చేసింది.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం

30.5 /22.2

## వాతావరణం

ఉదయం చల్లనిగాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. వాయుగుండం ప్రభావంతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి.

## న్యూస్‌రీల్

### జిల్లాలో దంచికొట్టిన వాన

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: జిల్లాలో వరుసగా వర్షాలు కురుస్తున్నాయి. శనివారం రాత్రి జిల్లావ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. కామారెడ్డిలో 52.3 మి.మీ., మద్నూర్‌లో 52, మాచారెడ్డిలో 42, ఎల్లారెడ్డి లో 41.5, లింగంపేటలో 41, తాడ్వాయిలో 39.5, భిక్కనూరులో 30.5, నస్రుల్లాబాద్‌లో 29.3, దోమకొండలో 28.8, పల్వంచలో 27.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలని మిగతా ప్రాంతాల్లోనూ మోస్తరు వర్షం కురిసింది.

### మరో నాలుగు రోజులు వర్ష సూచన



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: జిల్లాలో మరో నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ వాతావరణ విభాగం శాస్త్రవేత్త శ్రీలక్ష్మి తెలిపారు. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో జిల్లాలో నాలుగు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.

### పాన్ ఇండియా ఐకానిక్ టీచర్‌గా రామకృష్ణ




కామారెడ్డి రూరల్: కామారెడ్డి మండలంలోని చిన్నమల్లారెడ్డి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన గణితశాస్త్ర ఉపాధ్యాయుడు విజయగిరి రామకృష్ణ పాన్ ఇండియా ఐకానిక్ టీచర్ అవార్డు అందుకున్నారు. ఆదివారం గుంటూరులోని కెనెడి నెక్స్‌జెన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో అవార్డును ప్రదానం చేశారు. జీఎస్‌ఏ యూనివర్సిటీ డైరెక్టర్లు ఎడ్‌గ్రోమ్ ఇండిపెండెంట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్, జేమ్స్ అకాడమీ సంస్థలు, డీసీబీ బ్యాంక్, వివిధ ఉపాధ్యాయుల సంఘాల ఆధ్వర్యంలో దేశంలోని అత్యుత్తమ ఉపాధ్యాయుల జాబితా తయారుచేసి అవార్డుకు ఎంపిక చేశారు. సెప్టెంబర్ 5న గురుపూజోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన రామకృష్ణకు పాన్ ఇండియా ఐకానిక్ టీచర్-2024 అవార్డు కూడా దక్కడం జిల్లాకు గర్వ కారణం. కార్యక్రమంలో లండన్‌కు చెందిన ప్రముఖ వైద్యులు శ్రీహరి, డాక్టర్ గోపాల్, అధ్యక్షులు అనిల్‌కుమార్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మాగి శివారులో సాగవుతున్న వరి



# ఆశాజనకంగా వరి

- జిల్లాలో 2.11 లక్షల ఎకరాల్లో సాగు
- భారీ వర్షాలతో పంటకు భరోసా
- దిగుబడులు పెరుగుతాయని ఆశిస్తున్న అన్నదాతలు

**వరుణుడు కరుణించడంతో ఖరీఫ్‌కు భరోసా** లభించింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలు వరి రైతుల ఆశలను సజీవంగా ఉంచాయి. పంటలు బాగుండడంతో దిగుబడులూ పెరుగుతాయని అన్నదాతలు ఆశిస్తున్నారు.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాలో వర్షాకాలం సీజన్ ఆరంభమైన తర్వాత తొలకరి జల్లులే తప్ప భారీ వర్షాలు కురవకపోవడంతో రైతులు పంటల సాగుపై అయోమయానికి గురయ్యారు. కొందరు రైతులు ధైర్యం చేసి పంటలు సాగు చేయగా, మరికొందరు ఆచితూచి అడుగులు వేశారు. జూలై మాసంలో ఒకటి రెండు పెద్ద వర్షాలు కురిశాయి. దీంతో రైతులు వరి నాట్లు వేశారు. అయితే ఆగస్టు నెలలో పరిస్థితి ఒక్కసారిగా తలకిందులైంది. సాధారణ వర్షపాతం కూడా నమోదు కాకపోవడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. అయితే సెప్టెంబర్ మొదటి వారంలో నాలుగు రోజులు కురిసిన భారీ వర్షాలతో జిల్లా జలకళను సంతరించుకుంది. ఇంతకాలం ఆందోళనలో ఉన్న వరి రైతులు ఊపిరి పీల్చుకున్నారు. జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో 2.11 లక్షల ఎకరాల్లో వరి సాగైందని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. కాగా జిల్లాలో అక్కడక్కడ వరికి కొంత మేర తెగుళ్లు సోకినా.. మిగతా చోట్ల పంట బాగుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

### దిగుబడి పెరిగితే సిరి..

వరి పంట ఆశాజనకంగా ఉండడంతో దిగుబడి పెరుగుతుందన్న ఆశల్లో రైతులున్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులు పంట చేతికందేదాకా ఉంటే దిగుబడి గతంలో కన్నా మెరుగ్గా ఉంటుందని పేర్కొంటున్నారు. జిల్లాలో వరి 2.11 లక్షల ఎకరాలలో సాగు కాగా.. పత్తి 32,438 ఎకరాల్లో సాగైంది. సోయా 90,496 ఎకరాల్లో, మక్క 44,601 ఎకరాల్లో వేశారు. అన్ని పంటలూ బాగుండడంతో రైతులు ఆనందంతో ఉన్నారు. ఈసారి అన్ని పంటల దిగుబడులు పెరిగే అవకాశాలున్నాయని భావిస్తున్నారు.

### ఆదుకున్న తుపానులు

ఆగస్టులో వర్షాల్లేక ఇబ్బందిపడ్డ రైతులను సెప్టెంబర్ మాసం ఆదుకుంది. తుపాన్ల ప్రభావంతో ఈనెల 1 నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో జిల్లా జలకళ సంతరించుకుంది. వాగులు, నదులన్నీ పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులు, కుంటలే కాదు ప్రాజెక్టులన్నీ నిండి పొంగి పొర్లుతున్నాయి. దీంతో రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది.

జిల్లాలో వానాకాలం సీజన్ మొత్తంలో 996.7 మి.మీ. సాధారణ వర్షం కురవాల్సి ఉండగా.. ఇప్పటికే 879.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. భారీ వర్షాలతో వాగులు, వంకలు పారుతుండడం, ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు నిండుకుండల్లా మారడంతో భూగర్భజలాలు కూడా వృద్ధి చెందుతున్నాయి. ఫలితంగా ఎత్తిపోయిన బోర్లు కూడా ఎత్తిపోస్తుండడంతో ఖరీఫ్‌తోపాటు యాసంగిపైనా రైతులకు భరోసా ఏర్పడింది.



## కొలువైన గణపయ్య

జిల్లా కేంద్రంలోని స్టేషన్ రోడ్‌లో ఆజాద్ హింద్ వినాయక మండపంలో ప్రతిష్ఠించిన విగ్రహం

జిల్లావ్యాప్తంగా శనివారం వినాయక చవితి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఇళ్లలో వినాయక పూజలు చేశారు. మండపాలలో గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## మటన్ ముక్కల కోసం ఘర్షణ

- బారసాల ఫంక్షన్‌లో ఘటన
- పోలీసులకు ఫిర్యాదు

లింగంపేట: ఆనందోత్సాహాల మధ్య సాగుతున్న ఫంక్షన్‌లో మటన్ ముక్క చిచ్చురేపింది. ఇరు వర్గాలుగా విడిపోయిన బంధువులు దాడులు చేసుకుని, పోలీసు స్టేషన్ మెట్లెక్కారు. వివరాలిలా ఉన్నాయి. లింగంపేట మండల కేంద్రంలో ఆదివారం బారసాల(నామకరణం) ఫంక్షన్ జరిగింది. నామకరణం అనంతరం బంధుమిత్రులు భోజనాలకు ఉపక్రమించారు. ఈ క్రమంలో మటన్ ముక్కలు తక్కువ వడ్డించారని ఆరోపిస్తూ నామకరణానికి వచ్చిన బంధువులు భోజనం వడ్డించేవారిపై దాడి చేశారు. దీంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో పలువురికి గాయాలయ్యాయి. అనంతరం ఇరువర్గాలవారు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. ఇరు వర్గాలు రాజీ కుదుర్చుకున్నాయని ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపారు.

## అలీసాగర్ వరకు సాగర్ జలాలు



మాట్లాడుతున్న బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

- రెండు పంటలకు ఢోకా లేదు
- బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నిజాంసాగర్(జుక్కల్): ఇందూరు అన్నపూర్ణగా ప్రసిద్ధిగాంచిన నిజాంసాగర్ ప్రాజెక్టు కామారెడ్డి, నిజామాబా ద్ జిల్లాల రైతాంగానికి సాగునీరందిస్తూ ఆయకట్టును సస్యశ్యామలం చేస్తోందని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అలీసాగర్ రిజర్వాయర్ వరకు 'సాగర్' జలాలు అందిస్తున్నామన్నారు. అలీసాగర్ దిగువన ఉన్న ఆయకట్టుకు గుత్ప, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీరందిస్తున్నామన్నారు. ఆదివారం సాయంత్రం నిజాంసాగర్ ప్రాజెక్టును పోచారం శ్రీనివాస్‌రెడ్డి సందర్శించారు. మొరాయిస్తున్న 7వ నంబర్ గేటును పరిశీలించి నీటి పారుదలశాఖ అధికారుల నుంచి వివరాలు సేకరించారు. అనంతరం గుల్‌దస్తా వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నిజాంసాగర్ ప్రాజెక్టు నిండు కుండలా మారడంతో రెండు పంటలకు సాగు నీరు, బాన్సువాడ, బోధన్, నిజామాబాద్ పట్టణ ప్రాంత ప్రజలకు తాగునీటి ఢోకా లేదన్నారు. పర్యాటకులకు ప్రాజెక్టు వద్ద వసతులు కల్పిస్తామన్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టును పర్యాటక ప్రాంతంగా మార్చేందుకు ప్రభుత్వం నుంచి స్పెషల్ గ్రాంట్‌ను తీసుకువచ్చి పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు జయప్రదీప్, అంజిరెడ్డి, ఏర్వాల కృష్ణారెడ్డి, గంగాధర్, ఎజాస్, శ్రీధర్, మోహన్‌సింగ్, చరణ్‌రెడ్డి, నీటిపారుదలశాఖ ఈఈ సోలోమాన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ కాశీనాథ్ తదితరులున్నారు.

## వరంగల్ డిక్లరేషన్ అమలు చేయాలి

- రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి
- భారతీయ కిసాన్ సంఘ్ డిమాండ్



సమావేశంలో పాల్గొన్న రైతులు




మాట్లాడుతున్న భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు శ్రీధర్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రకటించిన 'వరంగల్ డిక్లరేషన్' ను వెంటనే అమలు చేసి, రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ముదిగంటి శ్రీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. భారతీయ కిసాన్ సంఘ్ కామారెడ్డి జిల్లా మహాసభల సన్నాహక సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు లొంక వెంకటరెడ్డి అధ్యక్షతన ఆదివారం పట్టణంలోని సరస్వతీ శిశుమందిర్ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధరరెడ్డి మాట్లాడుతూ.. రైతులందరికీ ఎలాంటి నిబంధనలు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ ప్రక్రియ తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. వరి ధాన్యానికి ప్రతి క్వింటాల్‌కు రూ.500 బోనస్ అమలు చేయాలన్నారు. రైతుభరోసా హామీ కింద ఎకరాకు రూ.15 వేలు ప్రతి రైతుకు, అలాగే కౌలు రైతులకు ఇచ్చిన హామీని సైతం తక్షణమే అమలు చేయాలని కోరారు. ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా పునరుద్ధరణపై ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. వరంగల్ డిక్లరేషన్ అమలు చేయని పక్షంలో తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు లొంక వెంకటరెడ్డి, నాయకులు ఆనందరావు, కోమిరెడ్డి అంజన్న, గైని నగేశ్, విఠల్‌రెడ్డి, సాయిరెడ్డితోపాటు భారతీయ కిసాన్ సంఘ్ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## ప్రాజెక్టుల్లోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో



నిజాంసాగర్ ప్రాజెక్టు గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు



కౌలాస్ ప్రాజెక్టు గేటు ద్వారా..



పోచారం అలుగు పైనుంచి ప్రవహిస్తున్న నీరు

నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 39 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో ఆదివారం ప్రాజెక్టు 5 గేట్ల ద్వారా 39 వేల క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు(17.8 టీఎంసీలు) కాగా ఆదివారం సాయంత్రానికి 1,404.62 అడుగుల (17.252 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.

### కౌలాస్ ప్రాజెక్టు నుంచి నీటి విడుదల

కర్ణాటక, మహారాష్ట్రల సరిహద్దు ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో జుక్కల్ మండలంలోని కౌలాస్ ప్రాజెక్టులోకి ఆదివారం 1,840 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో కౌలాస్ ప్రాజెక్టు ఒక వరద గేటు ఎత్తి 280 క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 458 మీటర్లు(1.237 టీఎంసీ) కాగా ప్రస్తుతం 457.65 మీటర్ల(1.152 టీఎంసీ) నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు ఏఈ రవిశంకర్ తెలిపారు.

### పోచారంలోకి..

నాగిరెడ్డిపేట: పోచారం ప్రాజెక్టులోకి 5,207 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు అలుగు పైనుంచి అంతే నీరు ఔట్‌ఫ్లో అవుతూ మంజీర నదిలో కలుస్తోంది.

### సాగర్‌లో పర్యాటకుల సందడి

నిజాంసాగర్ ప్రాజెక్టు పరిసర ప్రాంతాలు ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడాయి. జిల్లా నలుమూలలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి పర్యాటకులు తరలిరావడంతో సుల్తాన్‌నగర్ శివారులోని గుల్‌దస్తా రోడ్డుపై ట్రాఫిక్ జామ్ అయ్యింది. పర్యాటకులు వాహనాలను రోడ్డు పక్కనే నిలిపి ప్రాజెక్టు గేట్ల ద్వారా విడుదలవుతున్న నీటిని తిలకించేందుకు వెళ్లారు. కుటుంబ సమేతంగా వచ్చినవారు గుల్‌దస్తా ప్రాంతంలోని గార్డెన్‌లో సహపంక్తి భోజనాలు చేశారు. స్థానిక ఎస్సై సుధాకర్ ఆధ్వర్యంలో పోలీసులు ప్రాజెక్టు వద్ద బందోబస్తు నిర్వహించారు.

– నిజాంసాగర్



నిజాంసాగర్ ప్రాజెక్టుకు తరలివచ్చిన పర్యాటకులు



ప్రాజెక్టు జలసవ్వడిని తిలకిస్తున్న పర్యాటకులు

## డయాగ్నోస్టిక్ సెంటర్లలో దోపిడీ

- జిల్లాలో ఇష్టారీతిన ల్యాబ్‌ల ఏర్పాటు
- తప్పుడు బ్లడ్ రిపోర్టులు ఇస్తున్న వైనం
- సీజనల్ వ్యాధులే అదునుగా నిర్వాహకుల దోపిడీ
- ప్రైవేట్ వైద్యులు, పీఎంపీ, ఆర్‌ఎంపీల సహకారం.. పర్సంటేజీల పర్వం
- పట్టించుకోని ఉన్నతాధికారులు



డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు (ఫైల్)

కామారెడ్డి టౌన్: విషజ్వరాలు, మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వ్యాధులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఇదే అదునుగా జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రులు, పీఎంపీ, ఆర్‌ఎంపీలు, ల్యాబ్‌ల నిర్వాహకులు భారీగా దోపిడీకి పాల్పడుతున్నారు. ల్యాబ్‌లలో ఇష్టారీతిన పరీక్షలు నిర్వహించి బాధితులను భయాందోళనకు గురి చేస్తున్నారు. డెంగీ కేసులు అధికంగా నమోదవుతున్న నేపథ్యంలో రోగ నిర్ధారణ కోసం బాధితులు ప్రైవేట్ ఆస్పత్రులు, ల్యాబ్‌లను ఆశ్రయిస్తున్నారు. ఒక్కో ల్యాబ్‌లో ఒక్కో రకం ఫలితాలు వస్తుండడంతో రోగులు ఏది నమ్మాలో తెలియక అయోమయానికి గురవుతున్నారు.

### నిబంధనలు తూచ్

జిల్లాలో ఆస్పత్రులకు అనుబంధంగా, సొంతంగా 300లకు పైగా ల్యాబ్‌లు ఉన్నాయి. చాలా మంది ఎటువంటి అనుమతులు లేకుండానే ల్యాబ్‌లను నిర్వహిస్తున్నారు. వాస్తవానికి ల్యాబ్ ఏర్పాటు చేయాలంటే వంద అడుగుల స్థలం, అన్ని రకాల చికిత్సలకు సంబంధించిన పరికరాలు ఉండాలి. ల్యాబ్‌లో ఎంబీబీఎస్ డాక్టర్‌తోపాటు పాథాలజిస్ట్, టెక్నీషియన్స్, మైక్రో బయాలజిస్ట్ ఉండాలి. కానీ ఇవేవీ లేకుండానే ల్యాబ్‌లు కొనసాగుతున్నాయి. అసలు ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు చదవని, శిక్షణ లేని వారితో పరీక్షలు చేయిస్తున్నారు.

### యథేచ్ఛగా దోపిడీ

జిల్లాలోని కొన్ని ఆస్పత్రుల భవనాల్లోనే వైద్యులు ల్యాబ్‌లను ఏర్పాటు చేసుకుని అవసరం లేకున్నా రోగులకు రక్త పరీక్షలు రాస్తున్నారని ఆరోపణలున్నాయి. మరికొన్ని ఆస్పత్రుల వైద్యులు నెలనెలా 30 నుంచి 40 శాతం వరకు పర్సంటేజీలకు ఒప్పందం కుదుర్చుకుని ఎల్‌టీలకు ల్యాబ్‌లను అప్పగిస్తున్నారు. అలాగే ఎంబీబీఎస్, ఎండీ, పాథాలజిస్ట్, మైక్రో బయాలజిస్ట్‌లు కొనసాగిస్తున్న ల్యాబ్‌లకు ప్రైవేట్ వైద్యులు, పీఎంపీ, ఆర్‌ఎంపీలకు రోగులను పరీక్షలకు పంపిస్తే వారికి 25 నుంచి 30శాతం వరకు పర్సంటేజీలు ఇస్తూ రోగుల నుంచి అధికంగా డబ్బులు వసూలు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి.


### తప్పుడు రిపోర్టులు ఇస్తే కఠిన చర్యలు




జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ల్యాబ్‌లో తప్పుడు రక్తపరీక్షల ఫలితాలపై ఫిర్యాదు వచ్చింది. విచారణ జరుపుతున్నాం. ల్యాబ్‌ల నిర్వాహకులు బాధితులకు తప్పుడు నివేదికలను ఇస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. అనుమతి లేకుండా ల్యాబ్‌లు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తప్పవు.

– చంద్రశేఖర్, డీఎంహెచ్‌వో, కామారెడ్డి

■ విద్యానగర్ కాలనీకి చెందిన ఓ మహిళకు జ్వరం రావడంతో వారం రోజుల క్రితం ఓ వైద్యుడి సిఫారసు మేరకు గోదాం రోడ్‌లోని ఓ ప్రైవేట్ ల్యాబ్‌లో డెంగీ పరీక్ష చేయించుకున్నది. అర్హత లేని ల్యాబ్ టెక్నీషియన్ పరీక్షలు నిర్వహించి డెంగీ పాజిటివ్‌తోపాటు ప్లేట్‌లెట్స్ తగ్గాయని రిపోర్టు ఇచ్చారు. వారు అనుమానంతో మరో ప్రైవేట్ ల్యాబ్‌తోపాటు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో పరీక్షలు చేయించగా నెగెటివ్ రిపోర్టులు రావడం గమనార్హం.



బాలిక సంజనకు డెంగీ పాజిటివ్‌గా గతనెల 27న ప్రైవేట్ ల్యాబ్ ఇచ్చిన రిపోర్టు



ప్రభుత్వ డయాగ్నోస్టిక్ సెంటర్‌లో 28వ తేదీన ఇచ్చిన డెంగీ నెగెటివ్ రిపోర్టు

■ ఈ రెండు ల్యాబ్ రిపోర్టులు సదాశివనగర్ మండలం తిర్మన్‌పల్లికి చెందిన 14 ఏళ్ల ఆరే సంజనకు సంబంధించినవి. తీవ్ర జ్వరంతో బాధపడుతున్న సంజనను కుటుంబ సభ్యులు కామారెడ్డిలోని రైల్వే బ్రిడ్జి వద్దనున్న ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు. అదే ఆస్పత్రిలో ఉన్న ల్యాబ్‌లో డెంగీ నిర్ధారణ పరీక్షలు చేసి గతనెల 27వ తేదీన పాజిటివ్ రిపోర్టు ఇచ్చారు. ఆ తరువాత వైద్యుడు వైద్యానికి రోజుకు రూ.30వేలు అవుతుందని బాలిక కుటుంబ సభ్యులకు చెప్పాడు. అనుమానం వచ్చిన సంజన కుటుంబ సభ్యులు మరో ప్రైవేట్ ల్యాబ్‌లో అదే రోజు, మరుసటి రోజు తెలంగాణ ప్రభుత్వ డయాగ్నోసిస్ హబ్ సెంటర్‌లో పరీక్ష చేయించగా నెగెటివ్ రిపోర్టులు వచ్చాయి. దీంతో బాలిక కుటుంబ సభ్యులు ప్రైవేట్ ఆస్పత్రితోపాటు ల్యాబ్‌పై డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేశారు. మరో ఆస్పత్రిలో వైద్యం చేయించి బాలికను ఆరోగ్యంతో ఇంటికి తీసుకెళ్లారు.

# కులం ఒకటి.. సర్టిఫికెట్ మరోటి!

- ఉద్యోగోన్నతుల్లో మాయాజాలం
- ఆర్టీసీ రీజియన్ పరిధిలో కొందరి వక్రమార్గం
- నష్టపోయిన అర్హులైన ఉద్యోగులు




**సాక్షి ప్రతినిధి, నిజామాబాద్:** నిజామాబాద్ ఆర్టీసీ రీజియన్ పరిధిలోని కొన్ని డిపోల్లో కొందరు ఉద్యోగులు తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాలతో ఉద్యోగోన్నతులు పొందినట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీంతో అర్హులైన ఉద్యోగులు తమకు ప్రమోషన్లు రాకుండా పోయినట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు బీసీ ఉద్యోగులు ఎస్సీ కుల సర్టిఫికెట్లు తెచ్చుకున్నారని, మరికొందరు క్రిస్టియన్లుగా ఉన్నప్పటికీ ఎస్సీ సర్టిఫికెట్లు తెచ్చుకుని మరీ ఉద్యోగోన్నతులు సంపాదించడం పట్ల అర్హత కలిగిన ఉద్యోగులు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల ప్రకారం క్రిస్టియన్లు ఎస్సీ కేటగిరీలోకి రారు. ఇలా క్రిస్టియన్ మతాన్ని అవలంబించే వారు బీసీ–సీ కేటగిరీలోకి రావాలి. అయితే నిజామాబాద్ రీజియన్‌లో ఈ నిబంధనలు అమలు కావడం లేదు. దీంతో జూనియర్ అసిస్టెంట్లుగా, మెకానిక్‌లుగా చేరిన పలువురు గత పదేళ్లలో తప్పుడు సర్టిఫికెట్లతో ప్రమోషన్లు పొందినట్లు పలువురు ఆరోపిస్తున్నారు. పదేళ్లుగా ప్రమోషన్ల మీద ఉన్న ఉద్యోగులు మళ్లీ తాజాగా ప్రమోషన్లు పొందిన నేపథ్యంలో తమకు సర్వీసు మొత్తం అన్యాయం జరుగుతోందని అర్హులైన వాళ్లు వాపోతున్నారు. తప్పుడు ఎస్సీ, ఎస్టీ సర్టిఫికెట్లతో కండక్టర్లుగా పనిచేస్తున్న కొందరు తాజాగా ఏడీసీ (అసిస్టెంట్ డిపో క్లర్క్), బస్ స్టేషన్ కంట్రోలర్‌లుగా పదోన్నతులు పొందారు. నిజామాబాద్–1, నిజామాబాద్–2, ఆర్మూర్, బోధన్, కామారెడ్డి, బాన్సువాడ డిపోల్లో ఇలా ఉద్యోగోన్నతులు పొందిన వారి కారణంగా తమకు ప్రమోషన్లు రాకుండా పోయినట్లు పలువురు ఉద్యోగులు తెలిపారు.

■ గతంలో ఒక బీసీ ఉద్యోగి ఎస్సీ సర్టిఫికెట్ తెచ్చిన విషయమై ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘాలు రీజినల్ మేనేజర్‌కు ఫిర్యాదు చేశాయి. విచారణకు ఆదేశిస్తానని ఆర్‌ఎం చెప్పారు. గతంలో ఒక బీసీ వ్యక్తి ఎస్సీ సర్టిఫికెట్‌తో కండక్టర్ ఉద్యోగం పొంది అసిస్టెంట్ డిపో క్లర్క్ వరకు విధులు నిర్వహించాడు. ఈ విషయమై ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో విజిలెన్స్ విచారణ నిర్వహించిన ఆర్టీసీ వాస్తవమని తేల్చింది. దీంతో 30 ఏళ్ల సర్వీసు చేసిన అతన్ని సస్పెండ్ చేసి రిటైర్ అయ్యాక బెనిఫిట్స్ సైతం నిలిపేశారు. అయితే క్రిస్టియన్‌గా కన్వర్ట్ అయి ఉద్యోగోన్నతులు పొందిన వారి విషయంలో మాత్రం ఏవిధమైన విచారణ చేయించకపోతుండడం పట్ల ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్రిస్టియానిటీని అవలంబిస్తూ ఎస్సీ, ఎస్టీ సర్టిఫికెట్లు పొందిన ఉద్యోగుల విషయమై విజిలెన్స్ విచారణ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై నిజామాబాద్ రీజినల్ మేనేజర్ జానీరెడ్డిని వివరణ కోరగా ప్రమోషన్లు సాధారణ కోటాలోనే ఇచ్చామన్నారు. ఇదిలా ఉండగా సర్టిఫికెట్ల విషయమై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో నిర్ధారణ కోసం కలెక్టర్‌కు లెటర్ రాశామన్నారు. సర్టిఫికెట్లు తప్పుడువని తేలితే చర్యలు తీసుకుంటామన్నారు.


## క్లుప్తంగా

### ఎమ్మెల్యే సతీమణి చొరవతో అనుమతి



**నిజాంసాగర్(జుక్కల్):** జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు సతీమణి అర్చన చొరవతో ఆదివారం నిజాంసాగర్ ప్రాజెక్టుపైకి పర్యాటకులను పోలీసులు అనుమతించారు. ప్రాజెక్టు సందర్శనకు వచ్చిన ఎమ్మెల్యే సతీమణిని పర్యాటకులు కలిశారు. దూరప్రాంతాల నుంచి వచ్చినా ప్రాజెక్టు కట్టపైకి అనుమతించడం లేదని చెప్పారు. ఈ విషయమై స్పందించిన తోట అర్చన ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావుకు ఫోన్ చేసి వివరించారు. ఎమ్మెల్యే జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లడంతో పర్యాటకులను ప్రాజెక్టుపైకి అనుమతించారు. ఆమె వెంట నాయకులు కిశోర్, జయప్రదీప్, మల్లికార్జున్ తదితరులున్నారు.

### నిండుకుండలా మైసమ్మ చెరువు



**మద్నూర్(జుక్కల్):** భారీ వర్షాలు కురియడంతో మండల కేంద్రంలోని మైసమ్మ చెరువు నిండుకుండలా మారింది. వర్షకాలం ప్రారంభంలో చెరువులో చుక్క నీరు చేరలేదు. ఇటీవల భారీ వర్షాలు కురవడంతో చెరువు పూర్తి స్థాయిలో నిండింది. చెరువు కింద గల ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

### ముంపునకు గురైన పంటలు



**నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి):** మండలంలోని మంజీర పరివాహక ప్రాంతంలో వరి పంటలు రెండు రోజులుగా నీటిలోనే మునిగాయి. పోచారం ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న నీటికితోడు సింగూర్ నుంచి వస్తున్న వరదతో మంజీరనది ఉప్పొంగి ప్రవహిస్తుంది. దీంతో చీనూర్, నాగిరెడ్డిపేట, వెంకంపల్లి తదితర ప్రాంతాలలో వరిపంటలు నీటమునిగాయి. పొట్టదశలో ఉన్న పంటలు నీటమునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ముంపు నివారణకు శాశ్వత పరిష్కార చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## నడక నరకయాతన

**సదాశివనగర్(ఎల్లారెడ్డి):** మండలంలోని తిర్మన్‌పల్లి, మర్కల్, ఉత్తునూర్, వజ్జపల్లి, తుక్కోజివాడి, తిమ్మోజివాడి, గ్రామాల బీటీ రోడ్లు వర్షాలకు ధ్వంసమయ్యాయి. కనీసం కాలినడకన నడవ లేని పరిస్థితి నెలకొంది. భూంపల్లి నుంచి తుక్కోజివాడి గ్రామానికి వచ్చే బీటీ రోడ్డు మధ్యలో ఉన్న కల్వర్టు పూర్తిగా కుంగిపోయింది. ఈ రోడ్డు గుండా తుక్కోజివాడి, తిమ్మోజివాడి, భూంపల్లి గ్రామస్తులు రాత్రీ పగలు వ్యవసాయ బావుల వద్దకు తిరుగుతుంటారు. ఈ రోడ్లు ప్రమాదకరంగా మారాయి. ధ్వంసమైన రోడ్లపై అధికారులు దృష్టి పెట్టడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



అధ్వానంగా మారిన తుక్కోజీవాడి–తిమ్మోజీవాడి గ్రామాల మధ్య బీటీ రోడ్డు

## ఘనంగా తీజ్ పండుగ



**ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి):** ఎల్లారెడ్డిలో తీజ్ పండుగను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. శ్రావణ మాసంలో గిరిజన యువతులు నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు చేసి భక్తి ప్రపత్తులతో తీజ్ పండగను జరుపుకుంటారు. దీనిలో భాగంగా ఆదివారం పట్టణంలో గిరిజన యువతులు గోధుమ బుట్టలతో శోభాయాత్ర నిర్వహించారు. లింబేష్, సంతోష్, జీవన్, అనిల్ తదితరులున్నారు.

## పాఠశాలను వేరే ప్రాంతానికి తరలించాలి



బీబీపేటలో ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

**బీబీపేట:** మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతీబా పూలే గురుకుల పాఠశాలలో మౌలిక వసతులు లేవని, పాఠశాలను వెంటనే ఇతర ప్రాంతానికి తరలించాలని కోరుతూ విద్యార్థులు, తల్లిదండ్రులు ఆదివారం రోడ్డుపై బైఠాయించి మూడు గంటల పాటు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మాట్లాడుతూ.. హాస్టల్ భవనంలో మొత్తం 395 మంది విద్యార్థులు ఉండగా వారికి సరిపడా గదులు లేవని వాపోయారు. తరగతులకు, పడుకోవడానికి ఒకే గదులను వాడుతున్నారని అన్నారు. మరుగుదొడ్లకు కనీసం డోర్లు లేవని లోపల ట్యాప్‌లు కూడా సరిగ్గా లేవని పేర్కొన్నారు. వర్షాలకు కిటికీల్లో నుంచి వర్షపు నీరు లోపలికి వస్తుందని, బట్టలు, పుస్తకాలు తడుస్తున్నాయని, రాత్రి సమయంలో అన్నం సరిగ్గా వండడం లేదని విద్యార్థులు వాపోయారు. కలెక్టర్ దీనిపై స్పందించి పాఠశాలను మెరుగైన వసతులు ఉన్నచోటుకు తరలించాలని, లేకపోతే విద్యార్థులకు టీసీలు ఇప్పించాలని మరో పాఠశాలలో చదివించుకుంటామని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. చివరికి అక్కడకు చేరుకున్న ఎస్సై ప్రభాకర్ వారికి నచ్చజెప్పి ధర్నాను విరమింపజేశారు. ఉన్నతాధికారులు ఒకసారి పాఠశాలను సందర్శిస్తే మా పిల్లలు పడుతున్న ఇబ్బందులు తెలుస్తాయని ఓ విద్యార్థి తండ్రి రమేశ్ వాపోయారు.

## బాన్సువాడ బల్దియాకు 'అమృత్' జలం

- రూ.52 కోట్ల నిధులు మంజూరు చేసిన కేంద్రం
- కొత్త కాలనీలలో తీరనున్న తాగునీటి సమస్యలు



ఫిల్టర్ బెడ్ నిర్మాణానికి ఎంపిక చేసిన స్థలం ఇదే

**బాన్సువాడ:** బల్దియాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 పథకాన్ని అమలు చేస్తోంది. అందులో భాగంగా అమృత్ పథకం కింద బాన్సువాడ బల్దియాకు రూ.52 కోట్లు మంజురు చేసింది. టెండర్ కూడా పూర్తయింది. ఈ నిధులతో మరో 30 ఏళ్ల వరకు తాగునీటి సమస్య తలెత్తకుండా పనులు చేపట్టనున్నారు. బాన్సువాడ బల్దియాలో కొయ్యగుట్ట, తాడ్కోల్‌లో సగభాగం, బీసీ కాలనీ, కొయ్యగుట్ట తండా విలీనమయ్యాయి. అమృత్ 2.0 పథకంతో మంజూరైన రూ. 52 కోట్ల ద్వారా మున్సిపాలిటీ పరిధిలోని విలీన గ్రామాలు, పట్టణంలోని కొత్త కాలనీల్లో నెలకొన్న తాగునీటి సమస్యలు పరిష్కారం కానున్నాయి. బాన్సువాడ చింతల్‌నాగారం శివారులోని మంజీర ప్రాంతంలో అమృత్ పథకాన్ని ఏర్పాటు చేసేందుకు మున్సిపల్ అధికారులు స్థలాన్ని ఎంపిక చేశారు. అక్కడి నుంచి పైపులైన్ల ద్వారా పట్టణానికి, కొత్త కాలనీలకు, విలీన గ్రామాలకు తాగునీటి సరఫరా చేయనున్నారు. ఫిల్టర్ బెడ్ నుంచి మంజీర ప్రాంతం వరకు సీసీ రోడ్డు కూడా నిర్మించనున్నారు. అమృత్ పథకం ద్వారా తాగునీటి సమస్య, సీసీ రోడ్డు ద్వారా ఆయా ప్రాంతాల రైతుల సమస్యలు తీరనున్నాయి. బాన్సువాడ బల్దియా పరిధిలో సుమారు 50 వేలపైనే జనాభా ఉండగా 9,200 గృహాలున్నాయి. పట్టణంలో ప్రస్తుతం 21 వాటర్ ట్యాంకులు ఉన్నాయి. గతంలో 100 కిలోమీటర్ల మేర పైపులైను ఏర్పాటు చేశారు. అమృత్ 2.0 పథకం ద్వారా 18 లక్షల లీటర్ల సామర్థ్యమున్న వాటర్ ట్యాంకుకు అనుసంధానంగా 7 లక్షల సామర్థ్యమున్న ఒక ట్యాంకు, మరో 5 లక్షల లీటర్ల సామర్థ్యమున్న 4 వాటర్ ట్యాంకులను నిర్మించనున్నారు. బల్దియా పరిధిలో కొంత కాలంగా వెలుస్తున్న కొత్త వెంచర్ల వల్ల నీటి సమస్య ఉత్పన్నమవుతుంది. వెంచర్ నిర్వాహకులే ఆయా కాలనీల్లో ప్రతీ ఇంటికి నీటి సౌకర్యం వసతి కల్పించాల్సి ఉండగా వారలా చేయట్లేదు.

**ఇవీ చేసే పనులు..**

- అమృత్ 2.0 పథకం ద్వారా మంజూరైన నిధులతో మున్సిపాలిటీలో కింద పనులు చేపట్టనున్నారు.
- నూతనంగా 18 లక్షల లీటర్ల సామర్థ్యం ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం.
- 7 లక్షల లీటర్ల సామర్థ్యం ఉన్న ఒక ట్యాంకు
- 5 లక్షల లీటర్ల సామర్థ్యం గల నాలుగు ట్యాంకుల నిర్మాణం.
- ఇంటింటికి నీటిని సరఫరా చేసేందుకు 80 నుంచి 100 కిలోమీటర్ల పైపు లైను వేయనున్నారు.
- 6 వేల పైగా నల్లా కనెక్షన్‌లు ఇవ్వనున్నారు.

### తాగునీటి సమస్యకు పరిష్కారం



అమృత్ 2.0 పథకంతో మున్సిపాలిటీలోని ప్రజలకు తాగునీటికి శాశ్వత పరిష్కారం లభించినట్లే. గత ప్రభుత్వ హయాంలో మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి స్వచ్ఛమైన తాగునీటిని అందించాం. కొత్త కాలనీల్లో, విలీన గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యలు అమృత్ పథకంతో పూర్తిగా పరిష్కారం అవుతాయి.

– గంగాధర్, మున్సిపల్ చైర్మన్, బాన్సువాడ

## యువతిపై లైంగిక దాడి

**ఖలీల్‌వాడి:** జిల్లాకు చెందిన ఓ యువతిపై ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన యువకుడు లైంగిక దాడి చేశాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. యువతిని సదరు యువకుడు పెళ్లి చేసుకుంటానని నమ్మించి హైదరాబాద్ రప్పించాడు. నారాయణగూడలోని ఓ లాడ్జిలో 20 రోజులుగా ఉంచి ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలు ఫోన్ ద్వారా తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో వారు పోలీసులను ఆశ్రయించారు. దీంతో పోలీసులు యువకుడిని అరెస్ట్ చేశారు.

## 14 నుంచి సైక్లింగ్ పోటీలు



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి విజయ్‌కాంత్‌రావు

**నిజామాబాద్ నాగారం:** జిల్లాలో మొదటిసారిగా ఖేలో ఇండియా ఉమెన్స్‌లీగ్, రోడ్డు సైక్లింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు ఫెడరేషన్ ఆఫ్ సైక్లింగ్ ఇండియా ప్రతినిధి ఎంకె పాషా, జిల్లా కార్య దర్శి విజయ్‌కాంత్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిజామాబాద్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఖేలో ఇండియా, సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఈ నెల 14,15వ తేదీల్లో ఖేలో ఇండియా ఉమెన్స్‌లీగ్, రోడ్డు సైక్లింగ్ పోటీలను కంఠేశ్వర్‌లోని బైపాస్ రోడ్డులో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే వారు జూనియర్ విభాగంలో 2006–07, సబ్ జూనియర్ విభాగంలో 2008–11 మధ్య జన్మించిన వారై ఉండాలన్నారు. ఆసక్తి గల బాలికలు, మహిళలు ఖేలో ఇండియా వెబ్‌సైట్‌లోని ఎస్‌ఆర్‌ఎస్‌ఆర్ ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.10వేలు, ద్వితీయ రూ.6వేలు, తృతీయ రూ.4 వేల నగదు ప్రోత్సాహం అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 13 సాయంత్రంలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవలన్నారు. మరిన్ని వివరాలకు 9912883331 నంబర్‌న్ సంప్రదించాలన్నారు.



## క్రైం కార్నర్

### వేర్వేరు ఘటనల్లో నలుగురి మృతి

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని పలు గ్రామాల్లో చోటు చేసుకున్న వేర్వేరు ఘటనల్లో నలుగురు మృతి చెందారు.

**చేపల వేటకు వెళ్లి ఒకరు..**



**గాంధారి:** వాగులో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడి శనివారం మండల కేంద్రానికి చెందిన సయ్యద్ అలీ(40) మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సయ్యద్ అలీ చేపలవేట కోసం గ్రామ సమీపంలోని వాగుకు వెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి తిరిగిరాక పోవడంతో కుటుంబీకులు వాగు వద్దకు వెళ్లి వెతకగా మృతదేహం కనిపించింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి భార్య రిహానా బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

**చెక్ డ్యాంలో పడి యువకుడు..**



**ఇందల్‌వాయి:** మండలంలోని ఎల్లారెడ్డిపల్లె గ్రామానికి చెందిన గుర్రాల ప్రశాంత్(30) ప్రమాదవశాత్తు చెక్ డ్యాంలో పడి మృతి చెందినట్లు ఎస్సై మనోజ్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ప్రశాంత్ ఇటీవల గల్ఫ్ నుంచి వచ్చాడు. ఆదివారం ఉదయం తన పొలం వద్దకు వెళ్లిన అతను పొలం పక్కనే ఉన్న చెక్ డ్యాంను చూద్దామని వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

**కాలువలో పడి మరొకరు..**



**నిజామాబాద్ రూరల్:** నగరంలోని నాందేవ్‌వాడకు చెందిన సంత్‌పాలే జ్యోతిరాం(54) ఒకటో డివిజన్ ఖానాపూర్ శివారులో ఉన్న కాలువలో పడి మృతిచెందాడని రూరల్ ఎస్‌హెచ్‌వో ఆరిఫ్ ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు జ్యోతిరాం ఫైనాన్స్ వ్యాపారం చేసేవాడు. ఇటీవల తాగుడు బానిసయ్యాడు. ఖానాపూర్ నుంచి నాందేవ్‌వాడకు నడుచుకుంటూ వెళ్తుండగా ఖానాపూర్ ప్రాంతంలోని కాలువలో శనివారం పడి మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు మృతదేహాన్ని కాలువ నుంచి తీసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు తెలిపారు. మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

**సంతోష్‌నగర్ తండాలో మహిళ..**



**బాన్సువాడ రూరల్:** రోడ్డుపై నడుచుకుంటు వెళ్తున్న ఓ మహిళ కాలువలో పడి మృతి చెందిన ఘటన మండలంలోని కొత్తబాది గ్రామం సంతోష్‌నగర్ తండాలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. లింగంపేట్ మండలం భవానిపేట్ గ్రామానికి చెందిన బుజ్జిగారి రాజమణి(41) ఆరోగ్య పరీక్షల నిమిత్తం బాన్సువాడలోని ఆస్పత్రికి వచ్చింది. సాయంత్రం సంతోష్‌నగర్ తండాలో ఉన్న తెలిసిన వారి ఇంటికి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా ప్రమాదవశాత్తు కాలువలో పడిమృతి చెందింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కాలువ నుంచి తీయించారు. అనంతరం బాధిత కుటుంబానికి సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

## సైబర్ నేరగాళ్ల నయా మోసం

**మోర్తాడ్:** సైబర్ కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. జనాలను మోసం చేసేందుకు కొత్త పంథాను ఎంచుకున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటున్నారని, మోసం చేసేందుకు కొత్త విధానాలను అనుసరిస్తున్నారు. కొందరి నంబర్లను హ్యాక్ చేసి వారి బంధువుల నంబర్లకు లింక్‌ల ద్వారా వాటిని ఓపెన్ చేయలాంటు మెసేజ్ పంపుతూ నగదును అపహరిస్తున్నారు. తాజాగా ఇలాంటి ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మోర్తాడ్ మండలం పాలెంకు చెందిన మైలారం ప్రవీణ్ అతడి సోదరుడు మోహన్ నంబర్ ద్వారా వాట్సాప్ బ్లాక్ అయిందని ఆ లింక్ ఓపెన్ చేయాలంటు సైబర్ నేరగాళ్లు మెసేజ్ పంపించారు. తన సోదరుడి నంబర్ నుంచే కదా మెసేజ్ వచ్చిందని లింక్ ఓపెన్ చేయగా అతని ఖాతాలో ఉన్న రూ.94,160 నగదు మాయమైంది. విషయం గుర్తించిన ప్రవీణ్ వెంటనే సైబర్ క్రైం పోలీసులకు సమాచారం అందించాడు. జార్ఖండ్ రాష్ట్రం నుంచి సైబర్ నేరగాళ్లు నంబర్‌ను హ్యాక్ చేసినట్లు గుర్తించారు. ఈ విషయమై ఎస్సై విక్రమ్‌ను వివరణ కోరగా సైబర్ నేరాలు చేసే వారు ఎన్నో రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నారని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

## కొడిచర్లలో అగ్ని ప్రమాదం



**రుద్రూర్:** పొతంగల్ మండలం కొడిచర్లలో ఆదివారం అగ్ని ప్రమాదం సంభవించి మారతిగొండకు చెందిన నివాసపు గృహం దగ్ధమైంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో కరెంట్ షార్ట్‌సర్క్యూట్ జరిగి ఇంట్లో వస్తువులు కాలి బూడిదయ్యాయి. ఇంట్లో నుంచి పొగలు రావడం గుర్తించిన స్థానికులు కుటుంబీకులకు ఫోన్‌లో సమాచారమందించారు. అప్పటికే ఇంట్లోని నగదు, ఫర్నీచర్ దగ్ధమయ్యాయి. రెవెన్యూ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని పంచనామ నిర్వహించారు. ప్రమాదంలో రూ. లక్షా 50వేలు నగదు, రెండు తులాల బంగారం, పదితులాల వెండి, నిత్యావసర సరుకులు దగ్ధమయ్యాయని, సుమారు రూ. 4లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్టు అంచనా వేశారు. బాధిత కుటుంబానికి రెవెన్యూ అధికారులు తక్షణ సహాయాన్ని అందించారు. రూ. 25 కిలోల బియ్యం, రూ. ఐదు వేల నగదు అందజేశారు.

## ముగ్గురిపై కేసు నమోదు

**సిరికొండ:** మండల కేంద్రానికి చెందిన పారిపల్లి బినీల్ అనే యువకుడు, అతడి కుటుంబ సభ్యులపై దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్ రామ్ ఆదివారం తెలిపారు. మైలారం గ్రామానికి చెందిన సంపత్, చిన్నారెడ్డి, హుస్సేన్‌నగర్ గ్రామానికి చెందిన నవదీప్ మద్యం మత్తులో పాతకక్షల నేపథ్యంలో శనివారం బినీల్ ఇంటికి వెళ్లి దాడికి పాల్పడ్డారని ఎస్సై తెలిపారు. అడ్డు వచ్చిన కుటుంబీకులపై దాడి చేశారన్నారు.

విషయం తెలిసిన పోలీసులు అక్కడికి వెళ్లి వారిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలిస్తుండగా పోలీసులపై దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించారన్నారు. వారికి డ్రంకన్ డ్రైవ్ టెస్ట్ చేసి ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్ రామ్ పేర్కొన్నారు.

## పేకాటస్థావరంపై దాడి

**నిజాంసాగర్:** మండల కేంద్రంలోని బంజపల్లిలో పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ. 37,200 నగదు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## దత్తాపూర్‌లో పిచ్చికుక్క స్వైర విహారం

- ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలు

**డొంకేశ్వర్:** మండలంలోని దత్తాపూర్ గ్రామంలో ఆదివారం పిచ్చి కుక్క స్వైర విహారం చేసింది. పలువురిపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచింది. కిరాణషాపులో కూర్చున్న సుధారాణి వద్దకు వచ్చి విచక్షణ రహితంగా దాడి చేసింది. అలాగే రోడ్డుపై వెళ్తున్న హీరాబాయిని కరిచింది. స్థానికులు కుక్కను తరిమికొట్టి గాయాలైన మహిళలను చికిత్స నిమిత్తం నిజామాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పిచ్చికుక్క చిన్నపిల్లలపై దాడి చేస్తే పరిస్థితి వేరేలా ఉండేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి వీధి కుక్కల నివారణకు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**బీర్కూర్‌లో బాలుడికి..**

**బాన్సువాడ:** బీర్కూర్ మండల కేంద్రంలో ఆదివారం ఉదయం వీధి కుక్కల దాడిలో ఓ బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. మండల కేంద్రంలో ఓ పన్నెండేళ్ల బాలుడు రోడ్డుపై నడుచుకుంటు వెళ్తుండగా ఒక్కసారిగా రెండు వీధి కుక్కలు బాలుడిపై దాడి చేశాయి. అక్కడే ఉన్న స్థానికులు గమనించి కుక్కలను తరిమివేశారు. ఈ ఘటనలో బాలుడికి తీవ్ర గాయాలు కావడంతో స్థానిక ఆస్పత్రి తీసుకెళ్లి చికిత్స చేయించారు. ప్రస్తుతం బాలుడి పరిస్థితి బాగానే ఉంది. గతంలో కూడా వీధి కుక్కల దాడిలో పలువురికి గాయాలైన ఘటనలు ఉన్నాయని, అధికారులు తక్షణమే స్పందించి కుక్కల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



పిచ్చికుక్క దాడిలో గాయపడిన మహిళ

## ఎస్సారెస్పీ వద్ద భద్రత కరువు



ఫిరోజ్‌ను కాపాడేందుకు గోదావరిలో ఈదుతున్న రోహిత్

**బాల్కొండ:** ఎస్సారెస్పీ వద్ద భద్రత కరువవుతోంది. వారం రోజుల నుంచి అధికారులు గోదావరిలోకి నీటి విడుదల చేపడుతుండడంతో ప్రాజెక్ట్ సందర్శనకు పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తున్నారు. కానీ పర్యాటకులు ప్రాజెక్ట్‌పైకి వెళ్లేందుకు పోలీసులు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. అంతేకాకుండా ఆనకట్ట పొడవున, ఆనకట్ట కింద గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నారు. ప్రాజెక్ట్ దిగువన ఎస్కేప్ గేట్ల సమీపం నుంచి పుష్కర ఘాట్ వరకు ఎలాంటి భద్రత, బందోబస్తు లేదు. గతంలో అనేక ఘటనలు జరిగినా అధికారులు చర్యలు చేపట్టలేదు. ఎస్సారెస్పీ దిగువన ఉన్న గోదావరిలో ముంబైకి చెందిన ఫిరోజ్ ఆదివారం గల్లంతయ్యాడు. అతని ఆచూకీ లభించలేదు. అతని వెంట వచ్చిన మిత్రుడు రోహిత్ ఫిరోజ్ కోసం గోదావరిలో దూకి గాలించినా దొరకలేదు. ఉన్నతాధికారులు ఇకనైనా ఇలాంటి ప్రాంతాల్లో తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## లచ్చాపేటలో చోరీ

**మాచారెడ్డి:** మండలంలోని లచ్చాపేటలో తాళం వేసిన ఓ ఇంట్లో దుండగులు చోరీ చేశారు. గ్రామానికి చెందిన జనగామ దేవలక్ష్మి భువనగిరిలోని బంగారు లింగం దర్శనం కోసం ఈనెల 5న కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లింది. శుక్రవారం రాత్రి ఇంటికి వచ్చిన కుటుంబీకులు ఇంటి తాళం పగులగొట్టి ఉండటంతో పోలీసులకు సమాచారం అందించారు. బీరువాలో ఉన్న నాలుగున్నర తులాల బంగారం, ఇరవై తులాల వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయని బాధితులు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్ పేర్కొన్నారు.

**తిర్మలాపూర్‌లో బైక్..**

**బాన్సువాడ రూరల్:** మండలంలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన వడ్ల రాజు బైక్ ఆదివారం చోరీకి గురైంది. రాజు తన బైక్‌ను శుక్రవారం రాత్రి ఇంటి ఎదుట నిలిపి నిద్రించాడు. ఉదయం చూసే సరికి బైక్ కనిపించ లేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కృష్ణ పేర్కొన్నారు.

### మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

**పెద్దకొడప్‌గల్(జుక్కల్):** ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై మహేందర్ ఆదివారం పేర్కొన్నారు. మండలంలోని హస్గుల్ గ్రామానికి చెందిన కొందరు రాత్రి సమయంలో ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా ముందస్తు సమాచారం మేరకు ఆదివారం దాడి చేసినట్లు పట్టుకున్నట్లు తెలిపారు. ట్రాక్టర్లను పీఎస్‌కు తరలించి ట్రాక్టర్ల డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.